చెరుకూరి

విరిజల్లులు



చెరుకూరి వీరయ్య

కృతి : చెరుకూరి విరిజల్లులు
కృతి కర్త : చెరుకూరి వీరయ్య
ప్రచురణ కాలం : జనవరి 1997

నా మాట

ఈ పద్యాలు నాకిష్టమైన 'ఆటవెలది' పద్యరూపంలో రచించబడ్డాయి.

నేను వృత్తిరీత్యా ఇంజనీరును. నీటిపారుదల ఇంజనీరును , ప్రవృత్తిరీత్యా సాహిత్యాభిమానిని; కొద్దిపాటి సాహితీ స్రష్టను కూడా నాకు ప్రజలతో ముఖ్యంగా రైతులతో వృత్తిరీత్యా సాన్నిహిత్యం ఉండటం వల్లనూ, అలాగే రాజకీయ నాయకులతోను, ఇతర పెద్దలతోను కొంతవరకు పరిచయాలు ఏర్పడటంవల్లనూ, ప్రస్తుత సామాజిక వ్యవస్థ పట్ల, దానిలోని రుగ్మతలపట్ల కొంతవరకు అవగాహన ఉంది. ఆ అవగాహనే ఈ పద్యరచనకు ప్రేరణగా నిలచింది.

నేను ఏదో వ్రాయాలని ప్రయత్నించి, కూర్చొని, వ్రాసిన పద్యాలు. ఏదైనా భావం ఎప్పుడైనా మనోవీధిలో స్ఫురిస్తే, అప్పటికప్పుడు ఆ భావానికి అక్షర రూపం కల్పించటం జరిగింది. అందుచేతనే ఈ పద్యాలన్నీ ఒక నిర్దిష్టమైన విషయ క్రమంలో లేక ఒక 'కలగూర గంప'గా తయారయినై. వ్రాసిన క్రమంలోనే ప్రచురించాను.

వేమన పద్యాలు రూపంలో చిన్నదైన 'ఆటవెలది'లో సరళమైన పదాలతో కూర్చబడటం వల్లనూ, సమకాలీన సామాజిక స్థితిగతుల్ని ప్రతిబింబించటం వల్లనూ, ప్రజల నాల్కల మీదకు తేలికగా చేరిపోయాయి. వారి మనసుల్లో శాశ్వతంగా నిలచిపోయాయి.

వేమన అడుగుజాడలో సామాజిక స్పృహతో, చదువుకోటానికి, చదవడానికి వీలుగా, చిన్న చిన్న పదాలనే పద్యాలలో వాడాను.

నా కవితకు ఊపిరి ప్రేరణ. 'మనిషే'-ఇంకేం? వస్తుపరంగా కావలసినంత సరుకు లభ్యమయింది.

'ఉన్నమాట వీరయన్నమాట' అనే మకుటాన్ని నా పద్యాలకు తగిలించటంలో నా ఉద్దేశం ఏమిటో విశద పరచాలి.

ఇప్పుడు నేను చెప్పే యీ విషయాలన్నీ ఎందరో, ఎప్పుడో, ఎక్కడో చెప్పినవే; నేను క్రొత్తగా చెప్పేది చాలా తక్కువ, మరయితే 'చర్విత చర్వణం', 'పిష్ట పేషణం'లాగా చెప్పిందే చెప్పటం ఎందుకని ఎవరైనా అడుగవచ్చు. దానికి నా సమాధానం ఒకటే. గతంలో ఎందరో ప్రవక్తలు, మేధావులు, కవులు ఎన్నో నీతులు వల్లించారు. ఎన్నో విధాలుగా సమాజాన్ని హెచ్చరించారు. అయినా ఫలితం శూన్యం. సమాజంలోని రుగ్మతలు తొలగిపోలేదు, సరిగదా. అవి మరింత పెచ్చు పెరిగాయేమోననిపిస్తుంది. అందువల్లనే. మళ్ళీ మళ్ళీ ఆ నీతులను, ప్రవచనాలను సమాజానికి గుర్తుచేయటం ఎంతో అవసరమని నేను భావించాను.

చెరుకూరి విరిజల్లులు

స్నేహం చేస్తే ప్రాణమిస్తాడు , విరోధిస్తే ప్రాణం తీస్తాడు. ఇదే మనిషిలోని మానవ ద్వంద్వ ప్రవృత్తి. ఆ ద్వంద్వ ప్రవృత్తినే నా కవితలలో విశదపరచటానికి ప్రయత్నించాను.

సరే! ఇక నా కవితల్ని చదవండి. ఒకటికి రెండు సార్లు చదివి విశ్లేషించండి! విమర్శించండి! సద్విమర్శ కృతికి సమకూర్చు ఖ్యాతిని- అని విశ్వసించిన నాకు నా కవితలోని మంచి చెడులను తెలియజేయండి!

నా అభ్యర్థనను మన్నించి. నా కవితపై తమ అభిప్రాయాల్ని తెలియజేసి. నాకు ప్రోత్సాహమందించిన ప్రజాకవి, డాక్టరు నాగభైరవ కోటేశ్వర రావు గారికి, మిత్రులు దుత్తా దుర్గా ప్రసాద్ గారికి నాహృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

ఇట్లు
భవదీయుడు
చెరుకూరి వీరయ్య

హైదరాబాదు
26, జనవరి 1997

శ్రీ నాగభైరవ కోటేశ్వర రావు D.Litt.

ఒంగోలు

11జనవరి, 1997.

ఇంద్ర ధనుస్సు కవి

కవి ఎవరు?

తత్త్వేవేత్తా? కాదు.

మత ప్రబోధకుడా? కాదు.

చిత్రకారుడూ కాదు,

ఉపాధ్యాయుడూ కాదు,

దేశభక్తుడూ కాదు.

రాజకీయ నాయకుడు కానేకాదు.

మరి కవి ఎవరు?

ఎవరూ కాకుండా అన్నీ అయినవాడు కవి. ఏడు రంగుల్ని గుండెల్లో దాచుకొని ఏక వర్ణాన్ని పైకి చిమ్మే ఇంద్ర ధనుస్సు కవి చెరుకూరి వీరయ్య ఇంద్రధనుస్సు కవి.

చెరుకూరి విరిజల్లులు వారి ద్వితీయ కృతియైనా, యిది అద్వితీయ కృతి. దీనిలో ఆర్తి వుంది. ఆవేదన వుంది. దేశభక్తి వుంది. తీర్పరితనం వుంది. సూక్తి వుంది. సుధా మాధుర్యం వుంది. సమాజపులోతుల్లోకి ఎక్స్రే కళ్ళతో చూచిన నైపుణ్యం వుంది. నాజూకూ వుంది.

ఒకట గాయపరచి ఉత్సాహపడుచుండు

నొకట మందుపూసి యూరడించు

వింతజీవి మనిషి విశ్వమంతటిలోన...

అన్నప్పుడు తాత్త్వికుని గవేషణ తటిల్లతలా మెరుస్తుంది.

నైతిక పథమందు పరులను నడిపించి
మతములన్ని పుట్టి గతమునందు
దారితప్పి నేడు దానవులుగ జేసె...

అన్నప్పుడు ఒక చరిత్రకారుని సత్యమైన కథనం వుంది.

కాంచి సంతసించు కన్నులలో కంటె
కోరుకున్న నిండు గుండెలోన
సమధికముగ వెలుగు సౌందర్య తేజము

అన్నచోట చిత్రకారుని లేఖినీ లాస్యం వుంది.

కాలచక్రమెపుడు కదలుచునే యుండు
ఆగదెవరికొరకు నరనిముసము
కాన చేయరాదు కాలదుర్వ్యయమును.

ఇక్కడ గుండెలు పండిన ఉపాధ్యాయుని ఉద్బోధ వుంది.

మాట మంచిదైన మనిషి చిరంజీవి

అని నిజమై ప్రవహించినప్పుడు నిండు గుండెగల ప్రవక్త నిజాయితీ నిర్వచనం వుంది.సమకొనే నడి రేయి స్వాతంత్ర్య భారతి తెల్లవారుటెపుడో తెలియక అన్నప్పుడు పదహారణాల దేశభక్తుని మనసులోని పరివేదనం. పద్యమై రూపమెత్తిన ఆవేదన వుంది.

ఈ కవిలో లేనిదేమిటి? మాటల మాటున హిపోక్రసీ లేదు. వేషధారణం లేదు. వెర్రి నటన కానరాదు.

సూటిగా గుండెను విల్లంబుతో కొట్టే దృష్టాంతాలు వేమనకు తెలుసు, నార్లకు తెలుసు, వీరయ్యకూ తెలుసు. అందుకే మా వీరయ్య ఇంద్రధనుస్సుకవి.

నాగభైరవ కోటేశ్వరరావు

శ్రీ దుత్తా దుర్గాప్రసాద్

హైదరాబాదు
20 జనవరి, 1997

చెరుకూరి విరిజల్లులు

వీరయన్న మాట గురించి - ఒక్క మాట.

‘‘నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు
తలుకు బెలుకు రాలు తట్టెడేల
చదువ పద్యమరయ జాలదా యొక్కటి -

అని కుండ పగలేసి చెప్పాడు -వేమన

‘‘అరటిపండు వొలిచి అరచేత నిడినట్లు
తేటయైన కవిత తేజరిల్లు
అర్థమందుకున్న అడవి రోదవ యౌను..

అంటున్నారు విరిజల్లుల వీరయ్యగారు.

పదహారు, పదిహేడు శతాబ్దాలలో తెలుగు కవిత్వం వెల్లువలై పారింది. కారణం రాజపోషణ, మహారాజపోషకులు, రాజపోషకులు కుప్పలు కుప్పలుగా పండితుల్ని పొగేసి-పోషిస్తూ ఎలా పాడమంటే అలా పాడేలా తయారు చేసుకున్నారు. ఎక్కడో ఒక్కటీ ఆరా తప్ప మిగతా చెత్త సాహిత్యమంతా వరదలై మురుగు కాల్వల పాలయింది.

మామూలు మనిషికి ఈ సాహిత్యం దూరమైపోయేసరికి - కష్టజీవుల ఘొషకి ఏదో ఒక భాష కావలసి వచ్చింది. వాళ్ళ ఆనందాల్ని, ఆవేదనల్నీ పామర పదాలుగా మలిచి పాడుకొన్నారు. అలా పాడి పాడి, ఆ పాటలకి ఒక అమరత్వాన్ని ప్రసాదించారు.

ఈ పాటల తర్వాత భక్తి గీతాలు కీర్తనలు పుట్టుకొచ్చాయి.
వేదాంతులు సంస్కృతంలో పడిపోయారు.

ఇక సన్యాసులు మిగిలారు. జీవితాన్ని పాయసంలా గబగబా తాగేసి ఆ తీపి మీద విసుగెత్తి, విరక్తితో , నగ్నసత్యాల్ని అందరికీ అందజేయడానికి ఆటవెలదులను ఆశ్రయించారు. దాంతో శతక వాఙ్మయం దూసుకొచ్చింది.

దీన్లో కూడా ఒక భయంకరమైన పోటీ కీర్తనలకి అన్నమయ్య, పద్యాలకి వేమనా సంకేతాలుగా మిగిలారు.

అన్నమయ్య కీర్తనలు ఆకాశాన్నందుకొన్నాయి. వేమన పద్యాలు శిలాక్షరాలుగా నిలబడిపోయాయి.

భాష మనిషి మూలుగులోంచి పుట్టింది.
పాట మనుషులు కూని రాగాల్లోంచి ఊటగా పారింది.
పద్యం ఎదిగిన మానవుడి ఎదలోంచి ఉదయించింది.
ఏ సాహిత్యానికయినా పునాది మామూలు మనిషి.
వాడికి నచ్చింది నాలుగు కాలాలు నిలబడింది.
వాడికి నచ్చనిది రాజభవనాల్లో పుచ్చిపోయి.
చెదల పాలయింది.
అందువల్లనే అన్నమయ్య ,వేమన
ఈనాటికీ జనం గుండెల్లో ఉండిపోయారు.
వేమన చూపిన దారిలో చాలా మంది శతకాలు రాశారు.
ఈ అర్ధశతాబ్దంలో కూడా ఎన్నెన్నో శతకాలు
రూపుదిద్దుకున్నా, నిలబడినవి చాలా కొద్ది.
మనిషి తనలోంచి తన్నుకొచ్చే భావాల్ని
ఎదటివాడికి చెప్పేయగలిగితే
ఎంతో భారాన్ని దింపుకొన్నట్టు ఫీలయిపోతాడు.
సొల్లు మాటలు లేకుండా ఉన్నదున్నట్టు చెప్పేయడానికి
ఈ శతకాలు చక్కటి మార్గాలు.

చెరుకూరి విరిజల్లులు

శ్రీయుత వీరయ్యగారు గతంలో తమ 'చెరుకూరి చిరుమెరుపుల'లో తెలుగు దేశానికి మిరుమిట్లు చూపారు.

మెరుపుల తర్వాత నిజానికి ఉరుములు వినపడాలి.

కాని వాటిని దాటేసి – విరిజల్లులలోకి వెళ్ళిపోయారు కవిగారు.

ఈయన రైతు కుటుంబం లోంచి బయటికొచ్చి సేద్యపు నీటి శాఖలో పెద్ద ఇంజనీరుగా పనిచేసి, అన్నదాతలతో అత్యంత సన్నిహితంగా మెలుగుతూ, దశాబ్దాలపాటు వాళ్ళ సమస్యల్నీ, సంతోషాల్ని, కష్టాల్ని, కలల్నీ, బాగా అర్థం చేసుకొన్నవారు. అందువల్లనే ఆయన కవిత్వంలో మామూలు సమస్యలు, మామూలు మాటలు, హాస్యాలు, అపహాస్యాలూ వినిపిస్తాయి. ఉరుములు వినిపించవు.

మచ్చుకు కొన్ని: 58. విశ్వమంత గెలిచి విర్రవీగుట కన్న
తన్ను తాను గెలుచుటన్న మిన్న

68. గడ్డి మేసి ఆవు కమ్మని పాలిచ్చు.
ఖలుడు పాలుద్రావి క్రక్కు విషము.

90. ఆకలయిన వాని కన్నము దొరకదు
అన్నమున్నవాని కాకలుండదు.

131. అలి మాటలు విని అమ్మను తెగడును
అమ్మనూరిపోయ నాలిగాల్చు..

146. ఉగ్రవాద మరయ నున్మాద తత్త్వంబు
పిచ్చివాని చేతి విచ్చుకత్తి.

ఇవి పంచరత్నాలు:

ఇలాంటివి ఈ పుస్తకంలో పుంఖానుపుంఖాలు. చదివి చూడండి!

దుత్తా దుర్గాప్రసాద్

అంకితము

తే॥ ప్రకృతి ప్రకోపించి, పలు తుపానుల రేపి,
కొంప-గూడులనెల్లఁ గూల్చి వైచి,
పంటచేలను ముంచి, పండ్ల చెట్లనుద్రుంచి,
మనుజులఁ, బశువుల మట్టుబెట్టి,
అమ్మకు బిడ్డను, ఆలికి మగనిని
గాకుండఁ జేసి చికాకు బెట్టి,
అందాల సురసీమయగు కోనసీమను
వల్లకాడుగఁ జేసి, పరిహసింప,

తే॥ స్థైర్యమును కోలుపోయి, ఏదిక్కులేకఁ
బొగులుచున్నయభాగ్యుల బుజ్జగించి,
పెక్కురీతుల సాయముఁ బేర్మి నొసగి,
ధన్యులైన వదాన్యులఁ దలచి మదిని
యంకితమునిత్తు నీకృతిఁనమిత భక్తి.

చెరుకూరి విరిజల్లులు

1. రాజకీయమందు రాణించవలెనన్నఁ
దిట్లనెంచవలయు దీవెనలుగ
మదిని తలచరాదు మానమర్యాదల

2. నీతి, నియతి గల్గు నేతలుండిరి నాడు
అడ్డదార్లు ద్రొక్కుయధము లిపుడు
రాజకీయమింక రట్టుగా కెట్లుండు?

3. ఒక్కసారి గద్దెనెక్కిన నాయకు
డోడకుండుటన్న దొక్కవింత,
నేటి రాజకీయ నిర్వాక మింతియే!

4. ఒక్కసీటు కొరకు పెక్కురభ్యర్థులు
దేనికొరకొ ఇట్టి తీవ్రస్పర్థ?
దేశ సేవకొరకొ? దిగమ్రింగటానికో?

5. అందినపుడు జుట్టు, అందుకున్నను కాళ్ళు,
పట్టుచుందు రదను బట్టిచూచి,
అరయనిట్టులుందు రవకాశవాదులు,

6. న్యాయమూర్తులరయ నన్యాయవర్తులై
స్వార్థపరులకిలనుప్రాపునిడిన,
సంతకెక్కుఁగాదె, సాంఘిక న్యాయంబు?

7. కూరు చంద్రువేచి గోడపై పిల్లిలా,
దూకు చంద్రు పదవి దొరకు వయిపు
నేటి రాజకీయ నీచతత్వంబిదే?

8. నీతి, పాపభీతి, నియమబద్ధత లేవు
దేశ సేవఁజేయ దీక్షలేదు,
నేడు స్వార్ధమొకటె నేతల పరమార్ధ

9. మాటలెంచి చూడఁ కోటలు దాటును,
కాలు సాగదెపుడు గడప దాటి,
ఇటులనుండు నేటి ఎన్నిక బాసలు,

10. ‘బూతు’లాక్రమించి, చేతురు ‘రిగ్గింగు’,
కొనుదు రోట్లు సురను, ధనముఁ బంచి,
ఎన్ని వెధవ కళలొ ఎన్నికలందున?

11. రాజకీయమెల్ల రౌడీల కిరవాయె
సభలయందు, చట్టసభలయందుఁ
కేకలరుపులాయె, క్రియ శూన్యమైపోయె

12. ప్రజలకు సేవఁజేయ, ప్రాతినిధ్యముగొని
విధులు, బాధ్యతలను విస్మరించి,
జగడమాడుచుంద్రు చట్టసభలయందు

13. సమసిపోవ దెపుడ సమ్మతి వర్గమ్ము
పదవినేలు రాచపక్షమందు
అంతులేనిది కద, అధికార దాహమ్ము!

14. చట్టమనగ నొక్కసాలెగూడు విధాన
బడుగు కీటకములఁ బట్టివేయు,
కందిరీగ, తెలుకలందులో చిక్కవు

15. ఓటు మహితశక్తి యుర్విజనాళికి
బాటఁ జూపు సుపరిపాలనకును
చెనటికిడెడు ఓటు చేటును కొనితెచ్చు,

16 ఓట్లు గుంజువరకు పాట్లెన్నొబడుదురు,
అందలముల నెక్కి, యందరికను,
ఏరుదాటినాక నేలనింకను తెప్ప?

17. మిత్రుడుండు పైన, శత్రు వుండును క్రింద
తరచువారి యునికి తాఱుమాఱు,
రాజకీయమనగ రంగుల రాట్నమే!

18. కాసులెరను జూప మోసపోవగరాదు,
లొట్టిఁజూప మనసు లొగ్గరాదు.
ఓటు వేయవలయుమేటరి నేతకు (సు)

19. పాముచేతఁజచ్చు పాములవాడిల
వేటగాడు చచ్చు వేటయందు,
రాజకీయడీలు రాజకీయమునందె!

20. హత్యలుండవంట, ఆత్మహత్యలెగాని!
మాయదారి రాజకీయమందు
అసలునాయకులకు నాత్మలుండిన గదా!

21. మతమువలన సంఘహితమేమి కల్గెనో
బోధపడదుచరితపుటలఁ ద్రిప్ప,
మతముమూల మాయె మారణాలకు నేడు,

22. నైతిక పథమందు నరులను నడిపింప
మతములెల్ల పుట్టె గతము నందు,
దారి తప్పినేడు దానవులుగఁజేసె.

23. ఒక మసీదు ప్రక్క నొకమందిరముఁగట్ట
మతసమైక్యతకును హితము గలుగు,
గుడినిఁగట్టమేలె కూల్చి మసీదును?

24. ఉర్విరామజన్మ ఊహయో! సత్యమో!
రామ జన్మభూమి రగడఁదెచ్చె,
రహిని గూర్చలేని రామమందిరమేల?

25. బాబరీ మసీదుఁ బడగొట్టి, రామాల
యమును గట్ట పగలు యగ్గలించు,
ఒక్క కన్నునొచ్చ నొక కన్నుమెచ్చునా?

26. ఏ మతంబుతోడ నెట్టి బంధము లేక
నన్ని ధర్మముల సమాదరించి,
లబ్ధిగాంచునదియె లౌకిక రాజ్యంబు

27. చీలదీసె నరుల సృష్టించి వర్ణాలఁ
గూలద్రోసె జాతి కుదురుపాటు,
మూలమాయె మతము మూఢభావాలకు,

28. మతము మనసులందు మత్సరాలను పెంచె,
చెలగెవేరు దనుక స్నేహలతను,
శాంతినడచి భువిని సమరాంగణముఁజేసె

29. రాజకీయ దుష్ట రాక్షసి తోడైన
మతపిశాచి సల్పుమారణాలు,
తప్పత్రాగి కోతి నిప్పుఁద్రొక్కిన రీతి,

30. కులవిభేదములఁ గూలిపోవగవచ్చు,
మతవిభేదములును మాయవచ్చు.
వర్గభేదములను వారింప సాధ్యమా?

31. దమము, శమము, మైత్రి, దయ, దానముల చేత
మంచి మానవుడుగ మలచబడును,
కానియెడల మనిషి కటిక బండయెగదా!

32. మానవతము కద్దు-దానవతయు కద్దు,
కద్దు కరుణ, మైత్రి, కద్దు పగయు,
మంచి-చెడుల కలుపు మానవనైజము

33. ఒకట గాయపరచి ఉత్సాహపడుచుండు,
నొకట మందు పూసి యూరడించు,
వింతజీవి మనిషి విశ్వమంతటిలోన

34. లోకమెల్ల నొక్కలోగిలి కావలె
విశ్వమానవులను వేడ్కఁగూర్చి,
మనిషి దాగుకొనెడు మనికి పట్టదిగాదు.

35. చరిత రూపుదిద్దు జడుడు కానేరడు
మానవతను నెరపు మనుజుడెపుడు
తీర్చిదిద్దుత దీటైన చరితను

36. విశ్వమందు వెలయు వివిధ జాతులమధ్య
గోడలడ్డియున్నc గూల్చి వైచి
స్నేహబంధమందు చేరదీయగవలె

37. ఇడుమలcబడి, సాయమడుగువారలc దమ
ఇరుగు -పొరుగులవలె నెంచి, వారి
నాదరించవలయున మానవతయన్న

38. ఒరుల సుఖమె స్వసుఖమొక్కని కిలలోన,
తన సుఖంబె పరులదను నొకండు,
వరుస మంచి చెడుల నరయ భేదంబిదే!

39. మనసువిప్పి మనము మాటాడ నితరులు
నటులెనెమ్మనమున ననుకరింత్రు,
ఇంతదూరమటకునిదంతియే!

40. ఒరులు విశ్వసింప నొల్లని వాడైన
నరుడు తన్నుcదాను నమ్మవలయు,
నైతిక బలమిచ్చు నాత్మవిశ్వాసమ్ము

41. నింగి నుండి నీరు నేలపై కురియును,
నేలమీది నీరు నింగికెగయు,
నిచ్చిపుచ్చుకొనుట యీాలోకనైజంబు

42. చిన్నతనమునందు విన్నట్టి నీతులు
తీర్చి -దిద్దు నరుని తీరు -తెన్ను,
క్రొత్తకుండనంటు నొత్తిలి రంగులు

43. ఎద్దు చచ్చినప్పుడెముకయే మిగులును,
మనిషి చచ్చినపుడు మాట మిగులు,
మాట మంచిదైన మనిషి చిరంజీవి.

44. ఒకని నదుపునందు నుంచ బూననివాడు
ఒకరి యదుపులేక నుండువాడు.
మానవతను జాటు మహితాత్ముడిలలోన

45. బ్రతుకవలయుఁ బరుల బ్రతుకనీయగవలె
నన్న పరమ సూక్తి ననుసరింప
మనిషి మానవుడయి, మాననీయుండగు

46. మంచి మనిషికొొక్క మందలింపే చాలు,
సాధు పశువుకొొకటి చాలు దెబ్బ,
చెడ్డవానికెట్టి శిక్షైనఁ జాలదు

47. మంచి పేరుఁనొంద మనిషికిఁ బదియేళ్ళు
చాలవు, చెడిపోవ చాలు దినము,
మంచి బాట దూరమగు దాపు చెడుబాట

48. తప్పుఁ దెలిపి, ఒప్పుఁజెప్పువాడు హితుండు
గొొప్పుఁ బొొగడువాడు కుటిల మతుడు
బాగు -ఓగు నరసి సాగువాడు మనిషి

49. పిల్లల మనసెపుడు విప్పారి యుండును,
సంకుచించు బ్రతుకు సాగుకొొలది,
బాల్యదశయె మానవతకు దర్పణమిల

50. అరయఁదెలుగు వారికశుభమమావాస్య
యదియె పుణ్యదివస మరవలకును,
మనిషి తలపునందె మంచైన, చెడైన

51. లేడు చర్చిలోన, లేడు మసీదులో
లేడు గుడిని వెలయు లింగమందు
దేవుడుండు సతము దీన జనాళిలో

52. జాతి, మత, కులాల చర్చకుఁదావీక
సాటిమనిషి కిలను సాయపడిన
మానవతకు పట్ట మానాడె మహిలోన

53. బుడుతడేడ్చుచున్న బుజ్జగించుటకునై
బూచి బెదురు సూరిపోయరాదు,
లేతమనసునంటు భీతిపోదెన్నడు.

54. నిన్న నేర్చినట్టి నీతులఁమఱుక
నేడు విధులఁజక్క నిర్వహించి,
రేపు కలుగు బ్రతుకు తీపిని గొనవలె

55. పందిగాఁ బదేండ్లు బ్రతుకు నీడ్చుటకన్న,
నంది బ్రతుకుమిన్న నాలుగేండ్లు.
రాసి కంటె బ్రతుకు వాసి ముఖ్యము గదా!

56. తప్పుఁదెలిసి దాని నొప్పుటమేలగు
సిగ్గదేల? తప్పుఁ జేయునటుల?
తప్పు, దిద్దుకొనుట గొప్పగుణంబురా!

57. కాయమునకుఁగల్గు గాయంబు మానును,
మనసుగాయమైన మానుటెటుల?
కత్తిమొనను మించి కఱకు మాటయెవాడి

58. విశ్వమంత గెలిచి, విఱ్రవీగుట కన్న
తన్నుఁదాను గెలుచుటన్న మిన్న,
మనసుఁగెల్వనోపు మనిషి బలాఢ్యుడు

59. మంచి-చెడులఁ దెలిపి, మనిషిని వదలక
హెచ్చరించు మనసు హితుని వలెను,
వినకఁజెడును మనిషి, విన్నచో బాగుండు

60. తనదు ప్రతిభ వలనఁ దనరు నుత్తముడుగ,
మధ్యముడగుఁ దండ్రిమహితమునను
అధముడగును మామ యశమునఁబేరొంద

61. నేతి కుండఁదింపి నేలపైఁ బెట్టిరి,
ఉత్త కుండనెత్తిరుట్టి పైకి,
ప్రతిభకేది చోటు పాలనా రంగాన?

62. కులము, మతము, ధనము, కొలమానములు నేటి
ఎన్నికలకు నర్హ్వతెంచునపుడు,
నట్టిచో సమర్ధ నాయకత్వంబున్నె?

63. ప్రజకు సేవఁజేయఁ బ్రతిన బూనిన వాడు
కోప, తాపములను జూపఁరాదు,
కార్యకర్తకెపుడుఁగావలె సహనమ్ము

64. నరకుడెపుడొ చచ్చెనని వేడుకలఁజేతు
రెంతమంది నరకులిపుడు లేరు?
వారిఁగూల్చు సత్యభామలు కావలె

65. అందమైన గణిక, యధికార మోహమ్ము,
కోరి దరికిజేరు కోడెగాండ్ర
శీలమును హరించి, చెరచును బ్రతుకెల్ల

66. వంతలడచు నెన్నొ వంతులు విభజించి,
హెచ్చవేయు సుఖమునెన్నొరెట్లు,
మైత్రి మేలుఁగూర్చుమనిషి కెన్నొవిధాల

67. జలధిఁజేర నదుల జలము దుర్వ్యయమగు
నేలఁదాక రాజనాలుపండు
బరులకుపకరించు బ్రతుకె ధన్యము కదా!

68. గడ్డిమేసి యావు కమ్మని పాలిచ్చు,
ఖలుడు పాలుఁద్రావి కక్కువిషము,
పశువు ఖలుని కంటె పది రెట్లుమేలగు

69. చచ్చినపుడు మోయ, శవవాహకులు నల్వు
రుండవలయు, గాన నొప్పుగాను
చెలిమిఁజేయవలయు నలుగిరితోనిల

70. వినెడు వారలున్న వినిచెడువారుంద్రు
కట్టుకథలనెన్నొ కమ్మగాను
విన్న నమ్మరాదు వివరించిచూడక

71. గత చరిత్ర గతిని గమనించకున్న, నా
గతము నందె మరల బ్రతుకవలయు
ప్రగతిలేని జాతి సుగతికి దూరమౌ

72. పాలితులకు, దేశపాలకులకు, లక్ష్య
మొక్కటైన దేశమొందు స్థిరత
కానిచో యశాంతి కాకరంబగు గదా!

73. అంగుళికిని గాయమైనచో తనువెల్ల
బాధనందు, నటులె ప్రజలు కొంద
రటమటింప జాతి యంతయు కుందిల్లు

74. నిలువ గలిగితేని కలఁబడ జాలరు
కలియబడిన నెదుట నిలువలేరు,
మెత్తగున్నవాని మొత్తబుద్ధగు గదా!

75. అనుభవించు కొలది యతిశయిల్లును వాంఛ
నెయ్యిపడిన రగులు నిప్పువోలె,
వాంఛలడచుకొనెడువాడె యోగీశుడు

76. ఏరి వీరమాత?లేరి జగద్గురు?
లేరిత్యాగమూర్తులీధరిత్రి?
రత్నములు నశించి రాళ్ళు మిగిలెగదా!

77. బుద్ధ దేవుడేడి? పూజ్యబాపూ ఏడి?
ఏది వీర ఝాన్సి? ఏడి బోసు?
మణులు లేవు నేడు, మట్టిముద్దలెగాని,

78. మంచినెరిగి, దాని మన్నించగాలేదు,
చెడని తెలిసి దాని విడువలేదు,
నరుని తత్త్వమెరుగ నలువకైన తరంబె?

79. అన్నియున్న యాకు అడగారి యుండును
నిండుకుండ తొణకకుండు నెపుడు,
అటులె విజ్ఞులుందురాడంబరములేక

80. ఎచటినుండి రాక? ఎచటకు పోకని
తెగని ప్రశ్నలేల తెలివిమాలి?
వచ్చిపోవుటొకటే వాస్తవ మిలలోన

81. గుడిని మ్రింగునొకడు, గుడిలోని లింగంబు
మ్రింగు మరియొకండు, మించి గుడిని,
గోపురమును మ్రింగ నోపువేరొక్కడు

82. కలిమి గలుగు వారుఁగల రెందరోయిల
నెన్నగాను దాతలెందరందు?
ఈవిలేని కలిమి తావిలేని సుమంబు

83. దున్ను కాలమందు దూరదేశముపోయి
కోత కాలమందు కొడవ లంది
కోయబూనువాడు కొయ్యన గాడురా!

84. తెలిసి గాలివాలు తెరచాప నెత్తును,
త్రిప్పుగొడుగు నెండ దెసను బట్టి,
పలుకునొప్పునటుల బ్రతుకు నేర్చినవాడు

85. నిన్నుఁ జేరి, పొగడి, నీవైరులదెగడి,
నీదు మెప్పుబొంద నెంచువాని
నొక్క కంట జూడకున్న ముప్పు ఘటించు

86. ఎవడ పక్షిజాతి కెగురంగ నేర్పెను?
ఎవడు చేపపిల్ల కీతనేర్పె?
సహజగుణములబ్బు జన్మము చేతనే!

87. అడుగుఁదీసి, ముందుకడుగేసి నప్పుడే
గమ్యమెటులో చేరగలడు మనిషి,
కాక, చేరుటెటుల కదలక శంకతో?

88. మారు కాలమెపుడు, మారును లోకమ్ము,
మార్పు సహజసిద్ధ మవనియందు
మారలేని మనిషి మనజాల డిలలోన

89. బాధ సౌఖ్యమనెడు భావన మధురమై
యుండవచ్చునేమొ యోగులకును?
సగటు మనిషి కెటుల సాధ్యమీ తత్త్వమ్ము?

90. ఆకలైన వానికన్నము దొరకదు,
అన్నమున్నవాని కాకలుండ
దిక, యశాంతి తొలగుటెట్టు లీలోకాన?

91. చుట్టునలము కొన్న దట్టమౌచీకటి
దూరమగునె విధిని దూరినంత?
చెదరగొట్టనగును చిరుదివ్వె వెలిగించి

92. చదువుకొని యొకండు సంతలో పశువాయె,
విద్యలేక యొకడు వింత పశువు,
నరుని మానవునిగ, నడుపునుత్తమవిద్య

93. 'దేశభాషలందు తెలుగు లెస్స'ని బల్కు
పెద్దమనిషి తనదు పిల్లలకును
గఱపు నాంగ్ల భాష 'కాన్వెంటు' స్కూళ్ళలో

94. తిండిఁ దిన్న పుష్టి దేహమునకుఁ గల్గు
చదువుకున్న తుష్టి మెదడునకును,
తిండి -చదువులేని దేశమెడారియే!

95. మండుచున్న ప్రజల గుండెలలోనుండి
వెడలఁబారు నెపుడు విప్లవమ్ము,
జాతి ప్రగతిన చల్లారిపోయిన?

96. చీమ పుట్టలోనఁ బాములు చేరును,
ఈగలుంచు తేనెనెత్తు నరుడు,
పాటొకరిది కాగ, ఫలము వేరొకరిది

97. మెతుకు కానఁబడిన మెసగ దొంటిగ, తోటి
కాకులఁదిన బిలుచు, 'కావు' యనుచు,
పంచుకొనునె నరుడు పది మందితోనట్లు?

98. చెరువు నిండినపుడు చేరును కప్పలు,
తేనెలున్న విరుల తేటిచేరు,
కాసులున్నవానిఁగమ్ముదురెల్లరు

99. పేదవానికున్న పెన్నిధి సంతృప్తి
తనివిలేమి బీదతనము ధనికి
తనివి మించు కలిమి ధరణిలో లేదెందు

100. అన్నముఁ దినవచ్చు నాకలి నారంగఁ
ద్రావవచ్చు నీరు దప్పిఁదీర్చ,
ఆశఁదీర్చగలుగు ఔషధమిల లేదు.

101. సమకొనే నడిరేయి స్వాతంత్ర్య భారతి
తెల్లవారు టెపుడొ తెలియరాక
నటమటించుచుండె నంధకారమునందు

102. చాలకాలమాయె స్వాతంత్ర్యముదయించి,
వెచ్చఁబోయె ధనము వేనవేలు
బాగుపడగలేదు పల్లె స్వరూపమ్ము

103. నెగడు పల్లెలందె నిజమైన భారతి,
రైతె దేశమునకు రాజటంచు
రాత, కూతలందె, సేతలందున లేదు,

104. పల్లెలందు వెలసె భారతావని శోభ,
పల్లెదేశమునకుఁ బట్టుగొమ్మ,
పల్లెబాగు పడినఁ బ్రగతించు దేశమ్ము

105. మురికివాడలందు మురిగెడు లోగిళ్ళు,
బురదగుంటలందు పొరలు గొడ్లు,
మశక, మక్షికముల మనికియాయెను పల్లె

106. పారుచుండు మురుగు బాటలపైననే,
వఱలు మరుగుదొడ్లు బాటప్రక్క
శుద్ధిపరచు నూళ్ళ శునక సూకరములే!

107. వైద్యశాలలేని పల్లెలు కొల్లలు
కలవు బడులు లేని గ్రామములును
నీరసించి బ్రతుకు నిర్భాగ్యులెందరో!

108. ప్రకృతి యాగ్రహింపఁ బంటలు పాడైన
రైతు నాదుకొనగరాదు ప్రభుత
పంట నమ్మఁజూప బలుకదు తగుధర,

109. పల్లెసీమ దశను బాగుసేయగ, చిత్త
శుద్ధితోడఁ ప్రభుత సిద్ధపడిన
చేతరించి జాతి సిరులతో వర్ధిల్లు

110. ప్రజలు బ్రతుకునందు ప్రగతిగాంచనినాడు
విప్లవాలు రేగు విశ్వమందు
ప్రగతి లేని దేశ భవితవ్య మంధమే

111. ‘అమ్మ’యన్నయట్టి కమ్మని పదమును
పలుకలేని నోరు పాడుబావి,
ఒజ్జనేర్పనట్టిదొాక మాట ‘అమ్మ’యే

112. దైవముండుననుట తథ్యమో, మిథ్యయో!
దైవమీయడెపుడు దర్శనంబు,
కన్నతల్లిలను కనుపించు దైవము

113. కడుపులోని బిడ్డ కదలాడినప్పుడే
కలలుఁగాంచు తల్లి కన్నబిడ్డ
పెరిగి, పేరుగాంచి, పెద్దవాడౌనని

114. వ్యథిత హృదయమెప్పు డమ్మని తలచినా
హాయిఁ గూర్చు బాధ నపనయించి,
'అమ్మ'యన్న పలుకు ఔషధ రాజంబు

115. నవసి, ఎన్నొగతుల, నవమాసములుమోసి,
జన్మనిచ్చి, ప్రేమసాకునట్టి
తల్లి కంటె వేరెదైవత మిలలేదు

116. తల్లి కోరుచుండు పిల్లలు క్షేమంబు
తనను వారలెంత తక్కుచున్న,
చెడ్డ తల్లిలేదు, చెడ్డ బిడ్డలెగాని,

117. తండ్రి మోదమొందుఁ దనయుడుత్తముడైన,
తల్లి భేదమొందు భ్రాష్టుడైన,
తల్లి నేడిపించు తనయుని బ్రతుకేల?

118. జాలువారు సతము సంగీత నిర్ఝరి,
ఆగఁబోవ దెవ్వరడ్డుకొనిన
హాయి గూర్చుమనసు కాహ్లాద మందించి

119. మధుర గీతి వినిన మస్తమూచని వాడు,
కూన రాగమైన రాని వాడు,
ఉండడొక్కడైన యుర్వీతలంబున

120. సరస మధురమైన సంగీతమును విని,
మనసు తనిసి స్పందమందనట్టి
నరుడు మాయికుండు నమ్మరాదతనిని

121. శిశువెరుంగు, మరియు పశువు నెరుంగును,
ఎరుగుగానరసము నిల ఫణంబు
ఎరుగనట్టి నరుడు కొరగాని వాడొకో!

122. అరటిపండు నొలిచి, యరచేత నిడినట్లు
తేటయైన కవిత తేజరిల్లు,
అర్ధమందుకున్న నడవి రోదనమౌను

123. పీడితజనతప్త వేదనామయగాధ
ఎదకు తగిలి కవిని కుదిపినపుడె
కూర్చగలడతండు గొప్ప కావ్యంబును

124. మనసు దనిపి మల్లెమాలలూచగవలె,
నెదరగిల్చి మంట లెగచవలయు,
నెందుకింక కవిత ఏది సేయగలేక?

125. చదివిన చదువెల్ల చదువ నట్లున్నను,
చదవని చదువున్న జదివినట్లు,
చదువుతో పనేమి? చాలించవచ్చింక

126. జగతిఁగానరాడు సర్వజ్ఞుడొకడైన,
లేడొకింత తెలివిలేని నరుడు,
ఒక్కొకడు సమర్థు డొక్కొకక్రియలోన

127. అమ్మ ఒడిని వీడి, ఆలికౌగిలిజేరు
మునుపె చదువులెల్ల ముగియవలయు
పరిణయంబుతోడఁ బాడగు జదువెల్ల

128. అక్షర శర చయమునను్వుగా సంధించి,
గురినిచూచి కొట్ట గుండెకుదులు
నధికశక్తివంతమక్షర తూణీర

129. అన్నమిడిన ఫలితమఱిగెడు దాకుండు?
జదువుఁజెప్ప ఫలము శాశ్వతమ్ము,
అన్నిదానములకు మిన్న విద్యాదాన

130. ఇచ్చుచున్న కొలది ఎచ్చుచునేయుండుఁ,
దఱిగిపోవదెపుడు ధనమువోలెఁ,
నక్షయంబు జగతి నక్షర సంపద

131. ఆలి మాటలు విని యమ్మను తెగడును,
అమ్మనూరిపోయ నాలిఁగాల్చు,
మగువ లాడుకొనెడు మరబొమ్మ మగవాడు

132. కవిత రూపుఁ జెంది, కాలానుగుణముగా
భావి కాలమునకు బాటఁ జూప,
గలిగినపుడెవరలుఁ గలకాల మిలలోన

133. వాదముండుచోట ప్రతివాదముండును
బయటపడును నాడె వాస్తవమ్ము,
వాదమెపుడు శుష్కవాదముకారాదు,

134. బయటఁబడగ లోని వారలు యోచింత్రు,
లోనఁబొరగ వెలుపలున్నవారు,
భళిర! పెళ్ళియనగ ‘బంగారు పంజర’

135. కట్నమిడుట, గొనుట, కడు తీవ్రనేరమే
కాని, రోజు కెన్ని ఘాతుకములు?
బాపవలయు వీని మహిళాసమాఖ్యలే!

136. ఆగమించెనేని యణ్వస్త్ర యుద్ధము
జేతమందు, మరి, విజితుడు వ్రందు
నుర్వి యుద్ధమింక నున్మాదక్రీడయే

137. ధరణి యుద్ధములను తరిమి కొట్టుటకునై
శాంతి కొరకు కృషిని సల్పవలయు,
శాంతి మంత్రమొకటె చల్లార్చు యుద్ధాగ్ని

138. జయము ద్వేషము, నపజయము దుఃఖమ్మును
పెంచు, విశ్వశాంతి డించు, యుద్ధ
మతి వినాశకారి మానవ జాతికి

139. 'హంత'యందు రొకని నంతంబుఁ జేసిన
వేలమందిఁ జంప 'వీరుడంద్రు'
శాంతి -సమరములకు సరిహద్దు లివ్వియే,

140. ఉర్వి నూడ్చివేయు యుద్ధపిశాచిని
ప్రజలు కోరరెపుడు, ప్రభుతె గాని,
ప్రభుల రాజ్యకాంక్ష ప్రజకు కంటకమాయె,

141. పేదరిక, మవిద్య, పెనగు యాకలిబాధ,
బానిసత్వమిలను ప్రబలియుండ
నెటుల సమసమాజమేర్పడు జగతిలో?

142. ఆర్థికముగ దేశమతలాకుతలమగు
నౌరయుఁ బ్రజల బ్రతుకు ధరలు హెచ్చి,
అని రగుల్చుమంటలార వెన్నేళ్ళైన

143. స్వార్థపరతనెవరు 'బందులు' జరిపినా
మూతురన్ని కోట్లు ముందుగానె,
నష్టమునకు జడిసి, ఇష్టమై కాదులే!

144. తండ్రి నిధిని గూర్చి తనయుల కొసగిన
పనికిరాక వారు పాడగుదురు
చతురులగుదురోర్మిఁ జదివించి నట్లైన

145. చేయఁదగిన మేలుఁ జేయనొల్లడు, కాని
చేయదగని చెరుపుఁ జేయబూను,
తలప నిట్టులుండు ఖలు మనస్తత్త్వంబు

146. ఉగ్రవాదమరయ నున్మాద తత్త్వంబు
పిచ్చివానిచేతి విచ్చుకత్తి,
ఎప్పుడెవరికెటుల ముప్పుఘటిల్లునో!

147. చేతమందు నొకటి, రాతమరొక్కటి
యైన నిలువగలదె యట్టి రచన?
చిత్తశుద్ధి వలయు నుత్తమ రచనకు

148 సముఖమునఁ బొగడిక, చాటునఁ దెగడిక,
నోటితోడ నవ్వు నొసలి విరుపు,
ధూర్తజనుల కపటవర్తన మిటులుండు

149. ‘లేటు’గాను నిద్రలేచి బెడ్ కాఫీలు,
‘క్లబ్బు’లందు ‘డ్రింక్సు’, కార్డు ప్లేలు,
‘హార్సు రేసు’ వెరసి, ఇప్పుడేటు సొసైటి

150. తండ్రి త్రాగు చుండుఁదనయుని యెదుటనే
తండ్రి కన్నుఁగప్పి త్రాగు సుతుడు,
పశువు చేనుమేయ, బైటమేయువె దూడ?

151. పిరికివాడు చచ్చు పెక్కుసార్లు భయాన
ధీరు డొక్కసారి తీఁటిపోవు,
భయమె మృత్యువునకు 'ప్రతిరూపమిలలోన'

152. గెలుపు, ఓటము లిలఁగలసియే యుండును
కడలియలలు లేచి, పడువిధాన,
మనిషి నేర్వదగిన మంచి పాఠంబిది

153. సద్విమర్శ కృతికి సమకూర్చు ఖ్యాతిని
మంచి -చెడుల నందునెంచి, చూపి,
ఒరపు పెట్టకున్న మెరయునా స్వర్ణంబు?

154. కోర్టు కెక్కియావు కొమ్ములాగునొకండు,
వెనుక తోక లాగు వేరొకండు,
పొదుగువద్దఁ జేరి పోరుఁ దీర్చు వకీలు

155. తాడుగాఁ భ్రమించి, తాకఁగూడదు చేత,
పాముగాఁ భ్రమించి పాయరాదు,
పరికరించి చూచి, పదిలించుటేమేలు

156. కనకమంట దెపుడు కంసాలి వానింట,
నంటుకొనును కుమ్మరింట మట్టి,
చీడపట్టునటుల సిరిపట్టునా మరి!

157. ఒంటెయలరె ఖరము ఓండ్రపెట్టగవిని,
మురిసె ఖరము ఒంటె మురువు సూచి,
అల్పులెపుడు మెత్తురవలక్షణములనే!

158. కనుమ ఖరకరుండు కన్ను లానిన మేర,
కనును జ్ఞానదృష్టిఁ గవియెద్దైన
సవిత కానకున్నఁ గవి కానకుండునా?

159. కర్రలేదు జీలకర్రలో పరికింప
నేతి బీరలోన నేయి లేదు,
గుణము పేరులోనఁ గుదరదెల్లెడలను,

160. వనిత, కవిత తామె వలచి రావలె, గాని
బలిమిచేతఁ బొంద వలను పడునె?
సహజసిద్ధిలేక స్వారస్యమేముండు?

161. కోడలున్నయత్త గుణవంతురాలైన,
నత్తయున్న కోడలుత్తమ యగు,
నోరుమంచిదైన నూరు మంచిదికదా!

162. ఊహనింగికెగసి ఊళ్ళేలు చుండంగఁ,
గాయుచుండె రాతగాడిదలను
అర్హతలను మించి యాశింప భావ్యమా?

163. జనుల కేవగింపు, తనకంపు, తనకింపు
ఒరుల కంపు తనకు నోకరింపు,
స్వపర భేదభావ సంకుచితుడునరు.

164. కొండ-కొండకెక్కి, బండ-బండకు మ్రొక్కి,
ముడుపులొసగుచుంద్రు మూఢమతులు,
బండరాయి నరుని బ్రతుకును మార్చునా?

165. నెలత అర్ధరాత్రి నిర్భీతిఁదిరుగాడఁ
గలలు గాంచినాడు గాంధి నాడు
పట్టపగలెనేడు భద్రత కరువాయె

166. ఒక్కటపహరణలు, నొొక్కట మారణా
లొకట దహనకాండ లొకట సమ్మె
లివియె భారతోర్వి నీనాటి దృశ్యాలు

167. కనులు రెండు, మరియు గర్ణంబులును రెండు,
కాని, మనిషికొొకటె కలదు నోరు,
కనుట, వినుటెగాని, యనఁగూడదెక్కువ,

168. ఎడద పిడికెడైన కడలిలాగంభీర
మాశంతులేని యలల పగిది
ఉప్పతిల్లుచుండు నొక్కటొక్కటిగను

169. గాలి కెగిరిపోవు గడ్డిపోచల వెంటి
కట్టగలదు మత్తగజమునైన
కలసియున్న జాతి కడ్డులేదవనిలో

170. నాల్గు ఫైట్లు, మరియు నాలుగు 'డ్యూయెట్లు'
'బ్రేకు డ్యాన్సు', 'స్టెప్పు, రేపు సీన్సు,
వెరసి నేటి చిత్రవిజయకారణమగు

171, చినుకుఁ, జేరి సెలయేరుగాపారు,
వాగులెల్లఁ గలసి సాగు నదిగ
వ్యక్తి, వ్యక్తి కలసి శక్తిగా రూపొందు

172. వజ్రము తునియలగు వజ్రముచేతనే
ముల్లుఁ దీయనగును ముల్లుచేత,
దొంగ చిక్కుమరొక దొంగకు సులువుగా

173. సుజనులుగ్గడించు సూక్తుల విననంత
మంకు నైజగుణము మార్చుకొనునె?
మధురమగునె, కడలి నదుల నీరముఁగ్రోలి?

174. నరులఁ బ్రాణములనె హరియించును యముండు,
వెజ్జు గుంజు ప్రాణ, విత్తములను,
అన్న వైద్యరాజు యమధర్మరాజుకు

175. కూడఁ బెట్టి ధనముఁ గుడువనోచనివాడు
పేదకంటె మిగుల పేదకాడె?
ఇనుప పెట్టెలోన నెంతున్న ఫలమేమి?

176. తెగువఁజూపకున్న మగువలు మనలేరు
పురుషుడేలుచున్న పుడమి పైన,
అణగియున్న కొలది యణగఁద్రొక్కుచునుంద్రు

177. హలము పరుగులెత్త యవని 'సఫల'యగు,
కలము కదల భువిని చెలగు 'గవిత',
హలము, కలము నిలువ నవని 'మట్టి'యెగదా!

178. చింతకాల్చునరుని జీవించియుండగ
చితి దహించు బ్రతుకు చెల్లినపుడు
కాలకున్నవాడె కర్మ యోగి జగాన

179. 'ముడుపు'లొసగి నపుడె ముగియును పనులెల్ల
ఇవ్వకున్న 'రూల్సు' ఎదురు తిరుగు,
రూల్సు మారుచుండు రూకల బట్టియే

180. చేయగలుగువాడు చేసి చూపించును,
చేతఁగాని వాడు చెప్పుచుండు,
చెప్పుటంతో సులువు చేయుట కంటెను

181. పడుచుఁదనమునందు భర్తకు ప్రియురాలు,
వయసుమీరగ 'సహవాసిని'యగు,
ముదిమిలోనఁ భార్య 'ముఖ్యసేవిక'యగు,

182. కాయమునకు పెద్దగాయము తగిలిన
మాపగలడు వెజ్జు మందువేసి
మనసు దెబ్బతినిన మందేది? కాలమే!

183. మోకరిల్లి బ్రతుకు ముందుకీడ్చుట కంటె
నీదు కాళ్ళ నిలచి నీల్గుటొప్పు,
బానిసత్వమనగ బ్రతుకుకాదది చావు!

184. జాలువారవలయు సహజమ్ముగా కైత
రెమ్మ పుట్టినట్లు, కొమ్మనుండి
కానిచోనదెట్లు కమనీయమై యొప్పు?

185. మిత్రకోటిలోన మేలైన మిత్రుండు
మంచిపుస్తకంబు మనుజునకును,
విడచిబోవదెట్టి విషమఘడియనైన,

186. కోరి, పొందకున్నఁ గూరిమి హెచ్చగుఁ
గలిగియున్న దానికంటె నెపుడు
నందకున్నఁదీపి, అందినఁ బుల్లన!

187. బ్రతుకు నడ్డగలుగు బలవంతులెందరో!
చావు నాపగలుగు జాణలేరి?
మరణమునకు వేయి మార్గముల్గలవిల

188. నిన్నఁ జేసినట్టి నేరములకుఁ దోడు
రేపుచేయఁబోవు పాపములకు
నేడు యనుతపించువాడెపో మాయావి!

189. అరయనంతులేని యధికారమబ్బిన
మనిషి మనసు మిగుల మలినమగును,
బధిరుడంధుడగుచు ప్రల్లదించుచు నుండు

190. చదివి జ్ఞానియైన చవట కంటే జగాన
చదువురాని చవట చాలమేలు,
జ్ఞానియైన చవట హానిఁ గూర్చగలాడు

191.ప్రేమ కుండమందుఁ బెనగొను జంటలు
తలచరెన్నడొకరి తప్పులొకరు
ప్రేమగ్రుడ్డిదనిరి పెద్దలందు కెగదా!

192. బ్రతికినప్పుడెపుడుఁ బలుకనట్టి నిజమ్ము
కుదురు చావువేళ పెదవిపైన,
మృత్యువునకు సత్యమెట్టి చుట్టమొగదా!

193. కనులఁ జూచు సాటి మనుజుల ద్వేషించి,
కనని దైవమునెటు గౌరవించు?
నమ్మరాదు వట్టినయవంచకుడు వాడు

194. కట్టుకున్న భార్య కడురూపవతియైన
పరసతిపయి మోజుఁ బడుచునుండు
పొరుగునున్న పెరటి పుల్లకూరే రుచి!

195. ప్రతిభయొక్కటున్న రచయిత కాలేడు
మంచి రచన వెన్క మనిషి నిలచు,
మానవతయె ప్రాపు మంచి రచనకిల!

196. చెడ్డ తప్పులెన్న గడ్డిపోచలవలెఁ
బైకిదేలి కానబడుచునుండు,
మునిగి లోతునకును ముత్యముల్గొనవలె

197. ప్రతిఘటించ గలుగు ప్రతిపక్షముండక
సాగదెట్టి ప్రభుత్వ చాలనాళ్ళు,
అదుపు లేని యశ్వమటునిటు దూకును,

198. ఏండ్లు నేర్పుమనకు నెన్నియోపాఠాలు
దినములకుఁ నొకింత తెలియకుండఁ,
దక్కబోదనుభవమొక్క దినంబులో

199. తనను తాను నమ్మఁదగనట్టి మనుజుని
మూఢ నమ్మకములు ముంచివేయు,
వినునతండు వెఱ్ఱి వేదాంతములనెల్ల

200. వింటికెటులొ నారి, విభునకు నటులనే,
పంచుఁ బతిని తాను వంగునొకట,
నొకరులేనిచో మరొక్కరు వృధయెగా!

201. కుటిల బుద్ధితోడ గోతులఁద్రవ్వినఁ
దానె పడును వాటి లోన కడకు,
చెరుపఁదలచువాడు చెడకుండునా మరి!

202. కష్టకాలమందుఁ గడచిన సుఖములఁ
మదిఁదలంప దుఃఖ మతిశయించు
అగ్గిమండుఁగాదె ఆజ్యంబుఁబోసిన!

203. తల్లిదండ్రులకును, ధవునకుఁ, దాగన్న
బిడ్డలను పంచు ప్రేమ సతము,
ఆడదాని బ్రతుకు అనురాగచరితము

204. కడుపులో శిశువు ముడిచిన యరచేతి
గీతలెటుల బ్రతుకు రాతలగును?
ఔర! బూటకంబు హస్తసాముద్రిక

205. బ్రతికినప్పుడెంత బద్ధ శత్రువులైన
చచ్చియుందు రొకట సఖ్యతగను
వల్లకాటి కంటే చల్లని చోటేది?

206. గుండె రగిలి యగ్నిగుండమైయున్నచో
పూలు చేతిలోఁ బూయగలవె?
శాంతి పల్లవించుఁ చల్లని యెడదలో

207. ఒక్క గంట దాహమొక దినమాకలి
రేపు నరుని మదిని లేమి నెపుడు,
కాక భేదమేమి కలిమికి, లేమికి?

208. ఎంత చదివి, జ్ఞానమెంత గడించినా
చల్లబడదు నరుని జ్ఞానతృష్ణ,
అన్నినదులుఁ గలియ నంబుధి నిండునా?

209. కన్నవారలందుఁ గనికరం బిసుమంతఁ
జూపనట్టి సుతుడు, సుతుడు కాడు.
పాముకోర కంటె పదునైన వాడురా!

210. నరుడు తలచు పనులు జరుగకపోవచ్చుఁ,
దలచనట్టివేవొ తగులవచ్చు,
నంతయు మన మంచి కనెడు భావనమేలు

211. చెప్పవలయుఁగాన చెప్పకుమేదైనఁ
జెప్పదగినదైనఁ జెప్పుమెపుడు,
ఒప్పునపుడె నీవు చెప్పిన దిలలోన

212. విప్రవీగు నరుడు విజ్ఞాన మబ్బినఁ
బొందు వినయగుణము బుద్ధి వలన,
బుద్ధిలేక జ్ఞానమొందదు పరిపూర్తి

213. కైతలల్లునపుడు కలిగెడు బాధలో
తృప్తి కలదు, కవికె తెలియునదియుఁ,
గన్నతల్లికెరుక కాన్పునొప్పులు తీపి,

214. కాంచి సంతసించు కన్నులలోకంటె
కోరుకున్న నిండు గుండెలోన
సమధికముగ వెలుగు సౌందర్యతేజము

215. స్వేచ్ఛ నడచు, నాత్మవిశ్వాసమును డించు,
నీతిమార్గమందు నిలువ నీదు,
చేయులేమి నరుని జీవచ్ఛవంబుగా

216. ఉన్నవానిచెంత నూడిగంబున నిల్చు,
పరువు మంటగలిపి పరిహసించు.
పేదరికము నరుని పిచ్చివానిగఁజేయు.

217. మఱపు సహజగుణము మానవజాతికి
కొంతమంది కదియె గొప్పవరము,
కాని ఘోరశాపమౌను కొందరికదే!

218. ఒక్క తరువు ఫలము లొకలాగ నుండవు,
కొన్ని పుల్లన, మరికొన్ని తీపి,
ఒక్క తల్లి బిడ్డలొక్కలాగుందురా?

219. చెట్టునాని నిలుచుఁజెట్టు వనంబులో
మనిషినాని సంఘమందు మనిషి,
ఒకరికొక్కరూత ఉర్విని సహజమే!

220. మేడనున్న, లేక మిద్దెలోనున్నను
విడువదెపుడు మిత్తి గడువుఁదీర
సర్వజనులు సములె సమవర్తి దృష్టిలో

221. చినుకు చినుకు పడినఁ జిల్లులు వడురాయి
చీమ, చీమప్రాక శిలయు నరుగు,
పట్టు విడువకున్న బనులును సమకూరు

222. మద్యపాన భూత మావహించిన జీవి
ప్రాణ, మాన, విత్త భంగమంది,
సమయునగ్గి బడినశలభముకైవడి

223. కరవమన్నఁ గలుగుఁ గప్పకుఁగోపము,
వదలమన్న గుర్రు పామునకును,
ఉభయ రంజకముగ నుండుట సాధ్యమా?

224. ఇల్లు గుల్లయగును, ఒళ్ళును డొల్లగు,
ఆలు, బిడ్డలగుదు రడవిపాలు,
కాటికి రహదార్లు కల్లు, సారాయిలు

225. త్రాగుబోతుమగని యాగడంబులు హెచ్చ
తిరుగ బడెను నేడు తెలుగు మహిళ,
అబల, సబలయైన నడ్డువారెవ్వరు?

226. పదముఁ దీర్చి దిద్ద మధుర కావ్యంబగు,
శిలను తీర్చిదిద్ద శిల్పమగును
మనిషిఁ దీర్చి దిద్ద మానవుడగు గదా!

227. సజ్జనులను చేరి సామాన్యుడైనను
అమిత గౌరవంబు నందగలడు,
ననను బట్టియుండు నారయుఁదల కెక్కు

228. శిల్పిచేతియులియు, చిత్రకారుని కుంచె,
కావ్యరచనఁజేయు కవి కలంబు,
మానవతను చాటి మనగల విలలోన

229. చేయు పనిని గూర్చి చెప్పును యువకుడు,
చేసిన పనిఁ గూర్చి చెప్పు వృద్ధు,
చేయబూను పనిని చెప్పును మూర్ఖుడు

230. సంతు కలుగకున్న చింతయదొొక్కటే
సంతు కలిగెనేని చింతలెన్నొ,
సంతు భ్రష్టులైన చింతలింకెన్నెన్నో?

231. సంతు శిష్టులైన సంపద యికయేల?
సంతు భ్రష్టులైన సంపదేల?
సంతుకొొరకు ముల్లె సమకూర్చుటయె తప్పు!

232. కలుగు సుఖము, భయము కలిమిచేకూరిన
లేమియందు భయము లేమి, వెతయుఁ.
గలిమి లేములందుఁ గలుగు మంచి-చెడులుఁ

233. అత్త పగులఁగొొట్టి దుత్త పాతదియను,
కోడలగులఁగొొట్టఁ క్రొొత్తదనును,
అత్త పెత్తనమున నపరాధి కోడలే!

234. ఉన్నత శిఖరాలు ఉదయపు తొలికాంతిఁ
బడసి, నలుదెసలకు ప్రతిఫలించు,
విజ్ఞులిత్తురటులె విజ్ఞానజ్యోతుల

235. బానిసీడువలెను పాటొనర్చినవాడు
రాజువలెను సుఖములనుభవించు
పడిన పాటు కెపుడు ఫలితముండకబోదు

236. పొదను చూచి వెఱచుఁ పోలీసువాడని
తప్పుఁజేసి నరుడు దాగుకొనుచు
నెగుచు చుండు భయము నేరప్రవృత్తిని

237. ప్రజలు మూర్ఖులైన, ప్రభువులు ధూర్తులు
ప్రజలు యోగ్యు లైనఁ బ్రభులునటులె,
ప్రజలకుఁ దగినట్టి పాలకులుందురు.

238. ఇందుగలదు గాని యందు లేదనరాదు
ధరను లంచగొండితన పిశాచి,
ఎందువెదకిచూడ నందె దర్శనమిచ్చు

239. దినదినాభివృద్ధిఁ గనెడు సంఘమునందు
లంచగొండితనము రాచపుండు,
చక్కఁజేయవలయుఁ శస్త్ర చికిత్సతోఁ

240. తప్పుఁజేయువారు తమ తప్పులెరుగక
నెదుటివారి తప్పులెన్నుచుండ్రు,
గుదము క్రింది నలుపు గురిగింజ యెరుగునా?

241. వెజ్జుమాన్పలేని వింతరోగమెదైన
మిత్తి మాన్పగలదు బొత్తిగాను,
యముని మించువైద్యుడవనిలోనేలేడు

242. చదువులెన్నొ చదివి, సదసద్వివేకమ్ము,
లేనియట్టి బుద్ధిహీనుడరయ
పుస్తకాలమూట మోయు గాడిద కదా!

243. ఉండదు పదదోయి ఒకచెప్పులోపల,
నుండవొక్క యొఱను రెండు కత్తు
లుండవొక్కయింట రెండు కొప్పులుఁ గూడి

244. కప్ప బలిసి ఎద్దుగామార నుంకించి,
చచ్చె సుబ్బరించి, ప్రచ్చి తనువు,
వ్యర్ధమైన యాశ వంతల పాల్జేయు

245. లేమి కప్పియుంచు లేవడి గుణములఁ
గలిమి వెదకి పట్టి వెలికిఁదీయు
కలిమి దర్పణంబు కాగుణంబులకిల

246, ఏమటించ వచ్చు నెల్లరఁ గొన్నాళ్ళు,
కొద్దిమంది నెల్ల ప్రొద్దులందు
ఏమటించు టెటుల నెల్లరనెల్లప్పు

247. ఈ ప్రపంచమందు నేదేశమునకైన
గత చరిత్ర చాటు ఘనతఏమి?
జాతి, మతము పేర జరుపు హత్యలెగదా!

248. పాముకాటు వేయుఁబగబట్టినప్పుడే
'ఖలుడకారణముగఁ గలచుచుండుఁ
పాము కంటె ఖలుడు బహుప్రమాదకరుండు

249. త్రవ్వఁబూను బావి దాహమైనప్పుడే,
గుడి సెఁగప్పజూచుఁ తడిసినపుడె,
ముందుచూపులేని మూఢుడట్టినరుండు

250. గొ్రెకొరకు పోరి, కోర్టు కేగినవాడు
బ్రెపోయిగాని బయటఁబడడు,
బలియుదురు వకీళ్ళు పార్టీలు క్షీణింప

251. నేలగింజ నాటి, పాలుఁ దేనెలబోసి
పెంచ, వేము చేదువీడబోదు,
నీచబుద్ధి మారదే సూక్తులనుదెల్ప!,

252. పనుల యందు హెచ్చుపని, లొచ్చుపనిలేవు,
తలపునందె యుండుఁదరతమములు
కష్టపడుటవలన గౌరవమేదక్కు

253. మొఱుగు కుక్క రొట్టెముక్కల కోసమే
ముక్క దొరకగానె మొఱగదింకఁ
పదవిఁగూర్చ, వామపక్షి నోరెత్తునా?

254. తప్పుఁజేయువానిఁ దండింపకున్నదా
నెరుగలేడు తనదు నేరములను
శిక్ష దోషికి వరశిక్షకు డిలలోన

255. శుక్తిఁబడిన జలము మౌక్తికమైయొప్పు,
కల్లుముంతఁబడిన కల్లెయగును
ఆశ్రయానువృత్తమగును ఫలంబిల

256. ఆలసించితేనియమృతమె విషమగు
వేగిరింపఁ బనులు విఫలమగును,
సద్వివేచనమున సమకూరుఁబను లెల్ల

257. దాటి నదిని, తెప్పఁదగులబెట్టెడువాని,
కుడిచి, తల్లిరొమ్ము గ్రుద్దువాని
నమ్మగూడదెపుడు నయవంచకులువారు

258. తప్పుఁజేసి పదురుఁ దప్పించుకొనవచ్చు,
నెగులు పడగరాదు నిరపరాధి,
భువిని న్యాయశాస్త్రమూల సూత్రంబిదే!

259. సద్రసజ్ఞులైన సభికులు లేనిచో
సరస కావ్యగాన మరయ వృధయె!
అంధురాలిముందు యద్దముంచినరీతి

260. అందమైన పూలు తొందరగా వాడు
కలుపు మొక్క చాల కాలముండు
నగుణి మనుసు చిరము సుగుణివేగగతించు

261. పిల్లనిచ్చువాడు పిల్లిలాఁబడియుండు
పుచ్చుకొనెడివాడు పులిగమారు
నాడపిల్లఁగనుట యపరాధమాయెగా!

262. జనుల మనసులందు నణగియున్న యశాంతి
తిరుగుబాటుగాను తీవరించు,
శాంతివెలయుచోట సంఘర్షణేటులుండు?

263. చదువుకున్న వాడు సంస్కారి కావలె,
నీతి, నియతితోడ నెగడవలయు,
నటులగాకఁ జదువు కర్ధమేమున్నది?

264. పెద్దవారి మాటఁ బెడచెవిఁగొనవచ్చు,
రాజశాసనముల రాయవచ్చు.
నోపలేడు నరుడు ఉపహాసవచనాల

265. కాచగృహమునందుఁ గాపురముండుచు
రాళ్ళురువ్వరాదు రచ్చపైకి,
తిరిగి వచ్చి యనియె తెచ్చి పెట్టును ముప్పు

266. తుదకు మరణమొంద దుర్నీతి పరునైన
ప్రస్తుతింత్రు నీతి పరుడటంచు
గిట్టినట్టి నరుడు కీర్తి శేషుడెగదా!

267. ప్రేమపొటకరించి, పెనుపారి నప్పుడు
లేవు కులము, మతము ప్రేమికులకు
సర్వమానవాళి సమతయేఁబ్రేమన

268. సూర్యరశ్మి, గాలిఁ జొరనీక నిత్యము
మొనకొని కిటికీల మూసియుంచ,
వైద్యుడాగమించు ద్వారమార్గమునుండి

269. మైకు దొరకినంత మైకమ్ము బూనుచు
నుచితమెరుగలేని యున్మదులయి
సుత్తిగొట్టు చుంద్రు శ్రోతల బుఱ్ఱ పై

270. పూజవలనఁగాదు పూనికవల్లనే
చక్కనగును పనులు జగతియందు
రాయిరువ్వకెటుల రాలును కాయలు?

271. నిజము నాల్కమీద నిలచియుండు సతము
నిర్గమించు మనసు నెరుగనీక,
నిజము దాచతరమె నిప్పురవ్వలవోలె?

272. రాత్రి రాజ్యమేలు రంగస్థలంబుపైఁ
బవలు తిరిపెమెత్తి బ్రతుకునీడ్చు,
నటుల కాదరంబు నాస్తియీకాలాన

273. కాలచక్రమెపుడు కదలుచునేయుండు
ఆగదెవరికొరకు నరనిముసము,
కాన, చేయరాదు కాల దుర్వ్యయమును

274. ఉండుటరుదు పదవి యోగ్యతలను బట్టి,
అరుదు పదవికిదగు యర్హతలును
అదియె కతమునేటి యసమర్ధపాలన

275. కాగితమును మడిగ, కలమును హలముగా
గైకొని, కృషిఁజేయు కవికృషికుడు
రమ్యకావ్యసస్యరాజముల్ పండించు

276. కొందరు చెరసాల లందున బందీలు,
బందె జగము కొంతమంది కిలను
పరగనెల్ల జనులు బందీలు జగతిలో

277. రమ వసించుచో సరస్వతి యుండదు
దూరమెపుడు లక్ష్మి శారదకును,
పొత్తు కుదరదేమొ అత్తకోడళ్ళకు!

278. సర్వమును హరించు 'సారా'ను ద్రావించి,
బొక్కసంబు నింపబూను దొరలు
ప్రజలమేలుఁగోరు పాలకులౌదురా?

279. చావనంగ వేరు, చచ్చుటన్నది వేరు
రెంటి భేదమెంచలేడు నరుడు;
చావు సుఖము నిచ్చు, చచ్చుట దుఃఖమ్ము

280. గడనగలిగినపుడు పడతికి భర్తయే,
ఆయముండనప్పు డమ్మ కొడుకు,
ఆలి - అమ్మప్రేమలందంతరమ్మిదే!

281. కోడి పెట్ట సతముఁగూయుచుండగ నింటఁ
బుంజు మిన్నకుండిపోయెనేని,
యట్టి గృహముకాదె, అవరనరకమిల!

282. ఉత్తముడు గతింపఁ నూరేళ్ల శోకించు
పలువ చచ్చినపుడు వగచడెవడు
మంచి-చెడులె మిగులు మనిషి పోయిన వెన్క

283. బ్రతుకు బాటలోనఁ బయనంబు సల్పుచు
స్నేహలతను పెంపు సేయవలయుఁ,
గానిచో మిగులును కడకునొంటరికమే

284. జయము ప్రాప్తమగునె శౌర్యంబుఁజూపక
ప్రగతియున్నె త్యాగపటిమ లేక
కష్టపడక సుఖముఁగలుగునే యెందైన?

285. అతుల భోగములకు నాకరంబైనట్టి
పదవి యూడిపోవ మది చలించి,
పన్నుచుందురిలను ప్రత్యర్థి వర్గము

286. కొండ నెత్తవచ్చుఁ గొన గోటిపై నిల్పి
లెక్కఁబెట్టవచ్చు రిక్కలెల్ల,
మనిషిలోని మదము నణచుట సాధ్యమా?

287. ఉన్నవానికిడెడు ఉపహార మిలలోన
ఉదధిఁ బారవోయు ఉదకమువలె
వ్యర్థమగును గద! యపాత్రదానమ్ముగా

288. మనిషిగాఁ జనించి, మానవతను వీడి,
మారణాలొనర్చి మతము పేర
చల్లనైన భువిని వల్లకాడుగఁజేసె

289. ఆంధ్రుల కభిమాన మవధాన శిల్పము
కడమ భాషలందుఁ గానరాదు
కత్తిమీద సాము కవిపుంగవుల కది!

290. నేతలు కలహించి, నిందించుకొన, వారి
కుక్కలెపుడు రక్కు కొనుచునుండు,
కద్దు అట్టి కుక్కబుద్ధి 'చంచాల'కు

291. లేదు దైవభీతి లేశంబు నరునకు
దిగులు నరుని గాంచ, దేవునకును
తప్పుఁజేసి, ఏమి తలకు జుట్టునొయని

292. అందమను పునాది నాధారముగఁజేసి,
పెంచి, కట్టుకున్న ప్రేమసౌధ
మంతరించిపోవునందముతో పాటు

293. దానమడిగి, పొందలేని దీనుని కంటే,
నీయదలచి దాన మీయలేని
దాత పెక్కు రెట్లు దౌర్భాగ్యుడే సుమా!

294. జనన మరణములనుసంధించు బాటపై
సాగిపోవుచుండు సతము నరుడు కర్మ
అడుగు తీసి, వేయ నాయువుక్షీణమౌ

295. జనము హెచ్చగ, నవసరములు హెచ్చెను,
నిధులు లబ్ధి మిగుల నీరసించి,
కరికి గట్టి నట్టి కౌపీనమాయెగా!

296. కొండ మంచుగప్పి గుట్టలతోచును
మఱ్ఱితోచు చిన్నమావి వలెను
చూడప్రాజ్ఞుడటులె సూక్ష్మమై కనుపించు

297. నాడు వందితుండు నేడు నిందితుడాయె
'స్కాము'లందుఁ జిక్కి స్వార్ధపరత
చట్ట పరిధిలోన సములెంత వారైన

298. దేశ నేత దోఁచె దేశముపైఁబడి,
రాష్ట్రనేత దోచె రాష్ట్రప్రజల
దొరికినంత వరకు దోచెను ప్రతినేత

299. పదవినేలునపుడె పదిరాళ్ళు వెనకేయు
బిడ్డలకును, వారి బిడ్డలకును
దీపముండ నిల్లుదిద్దుకోవలెగదా!

300. ఎందు కెటులు, నెప్పు డేమని యడుగక
విన్నదెల్ల నమ్ము వెఱ్రివాడు
బుఱ్రలేని వట్టి గొఱ్రెతో సమమయా!